# 'తప్పు'టడుగులు

**ఎ.బాబురావు**

ఆఫీసు నుండి ఇంటికి వచ్చిన నాకు ఒక్కసారే నీరసం ముంచుకొచ్చింది. ఇంట్లోకి వెళ్ళే ఓపిక లేక వరండాలోని పాతకుర్చీమీదే నా శరీరాన్ని కూలేసా! మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆఫీసు నండి కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి వచ్చేసరికి ఈ నా 50 ఏళ్ళ వయసుకు ప్రాణం ఉసూరుమం టుంది.

''శాంతా...!'' అంటూ నా భార్యను కేకవేసా.

లోపల వంటింట్లో... ఏ మూలనుందో! తాను? నా మాట వినిపించిందో...! లేదో...?

ఓసారి వంటిల్లువైపు తొంగిచూసా! శాంతా...! కాసిన్ని మంచినీళ్ళు అందుకో...?

ఉహూ! సమాధానం లేదు.

నా పిలుపు చిన్న కూతురికి వినబడింది కాబోలు. ఏంటి నాన్నా...?

''మంచినీళ్ళా...'' అంటూ చిన్ని చెంబుతో నీళ్ళు తీసుకొచ్చింది.

గటగటా అంటూ గొంతులోంచి జారిన చల్లని మంచినీటికి ప్రాణం లేచొచ్చింది.

చెంబు తిరిగి ఇస్తూ... ''మీ అమ్మ ఎక్కడి కెళ్ళింది...?''

''పక్కింటి వాళ్ళింట్లో పేరంటానికి వెళ్ళింది నాన్న''

''పెద్దన్నయ్య వచ్చాడా...?'' లోనికి తొంగిచూస్తూ అడిగా.

''ఇంకా రాలేదు నాన్నా...''

''ఈరోజు ఇంటర్వ్యూ వుందని వెళ్ళాడు! ఏమ య్యిందో...''

నాలో నేను మాట్లాడుకుంటూ పైకి అనేసా!

''తెలియదు నాన్నా!'' చెంబు తీసుకొని లోనికి వెళ్ళింది తాను.

''ఎప్పుడొచ్చారండి...'' అంటూ నా భార్య శాంత లోనికి అడుగిడుతూ పలకరించింది.

''ఇప్పుడే... పెద్దబ్బాయి ఎన్నింటికి వెళ్ళాడు....''

''మీరు ఆఫీసుకు వెళ్ళగానే వెళ్ళాడు...''

''మళ్ళీ, నాన్నమీద... అదే నీ మొగుడిపైన ఏమైనా కారాలు... మిరియాలు నీ పుత్రరత్నం నూరాడా...'' సందేహంగా అడిగా.

''ఏమిటండి ఆ మాటలు...?'' బుగ్గలు నొక్కు కుంటూ మందలింపుగా అన్నది.

''చూడు శాంత ఎమ్.ఎ పట్టా చేతికి రాగానే వాడు తన ఫ్రెండ్‌తో కలిసి బిజినెస్ చేసుకుంటా నాన్న! పాతిక వేలు ఇవ్వండి అన్నప్పుడు ఇల్లు కుదువబెట్టి అన్నా డబ్బు తెచ్చి ఇవ్వలేకపోతిని'' బాధగా అన్నా.

''ఇప్పటికే పెద్దమ్మాయి పెళ్ళి తాలుకూ అప్పుకే ఇల్లు కుదువలోనే ఉంది. ఇంకా ఎవరిస్తారండి...? మనకు ఈ పాత ఇంటిపై అప్పు'' నిరాశగా అంది శాంత.

భార్యతోపాటు ఇంటిలోనికి అడుగుపెడుతూ పెద్దబ్బాయి ఇంటర్వ్యూ ఏమయ్యిందో అని ఆలో చిస్తూ...

కొందరి జీవితాలు ఎప్పుడూ నిరాశపూరితంగానే ఉంటాయి కాబోలు. అలాంటిదే నా జీవితం.

నా పేరు రాజారావు. నే పని చేసేది ఒక ప్రైవేటు సంస్థలో చిన్న క్లర్కు ఉద్యోగం. తల్లిదండ్రులు పంచి ఇచ్చిన ఆస్తి మిగిలిన ఈ ఆరు గదుల శిధిలావస్థలో నున్న పెంకుటిల్లు మాత్రమే.

నాకున్న సంతానం నలుగురు. పెద్దమ్మాయి ఉమ. మూడేళ్ళక్రితం వివాహం చేశా. తాహతుకు మించి చేసిన పెళ్ళి అప్పు ఇంకా నలభైవేలపైనే ఉంది. తరువాత అబ్బాయి ప్రస్తుతం వాడి వయస్సు 23 పేరు కృష్ణప్రసాద్. చదువులో చురుకుగా ఉండటంతో ఎమ్.ఎ వరకు చదివించా. ప్రస్తుతం వాడి పని ఉద్యోగ అన్వేషణ.

చదువు తనకు రాదనుకున్నాడో... లేక తానే చదువుకోలేకున్నాడో... మరి చిన్నవాడు వెంకట చైతన్య పదవ తరగతికే పంగనామాలు పెట్టి తనకిష్టమయిన రంగం... మెకానిక్ షెడ్‌లో చేరిపోయాడు వాడి వయస్సు 20. చిన్నమ్మాయి ఉష ప్రస్తుతం ఇంటరు వయస్సు 17. ఇక మిగిలింది నా భార్య పేరు మీకు తెలిసిందే... పేరుకు తగ్గట్టే శాంతమూర్తి.

నాకున్న చిన్ననాటి స్నేహితుడు సూర్యారావు. వాడు నేను చిన్నప్పటి నుండి క్లాస్‌మేట్స్. వాడు ప్రస్తుతం కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. ఆఫీసు నుంచి రాగానే వాడి దగ్గరే పొద్దుపోయేంతవరకు నా బాతాఖాని.

''శాంతా... సూర్యారావు దగ్గరికి వెళ్ళొస్తా...'' ఖాళీ కాఫీ కప్పు క్రింద పెడుతూ, బయటకు నడుస్తూ చెప్పా.

మా వీధి నుండి మూడిళ్ళ అవతలి వైపు దుకాణం.

''ఏరా...! ఈరోజు రావడం ఆలస్యం అయ్యిందే...?'' ఆప్యాయంగా అడిగాడు సూర్యం.

సూర్యం అని పిలుస్తా వాడిని చిన్నప్పట్నుంచి.

''పెద్దబ్బాయి ఇంటర్వ్యూకని వెళ్ళాడు... ఇంకా రాలేదు...''

''ఎక్కడ ఇంటర్వ్యూ...''

''ఏదో కంపెనీలో సేల్స్ సూపర్ వైజర్‌గా... మన పక్క ఊరు సంగారెడ్డిలోనే''

''జీతం ఎంత...?''

''అన్నీ కలిపి దాదాపు 8000 వరకు''

''వస్తాడ్లే కంగారు పడకు...''

''నే తప్పు చేసానేరా...'' అడిగా సూర్యాన్ని.

''ఏం ఎందుకు...?''

''వాడు అడిగినప్పుడు ఆ పాతికవేలు తెచ్చి ఇస్తే...''

మధ్యలోనే అందుకున్నాడు... ''అరేయ్! రాజా మనకు శక్తికి మించిన వాటి గురించి ఆలోచించటం అనవసరం... అదే. ఆ పాతికవేలు ఎక్కడి నుండి తెచ్చేవాడివి....'' రెట్టించి అడిగాడు వాడు...?

సమాధానం లేదు నా దగ్గర...

సూర్యం అడిగే ప్రశ్నలకు యాంత్రికంగా సమాధానాలు చెప్తున్నా పెద్దబ్బాయికి ఉద్యోగం రావాలని ఆ షిర్డి సాయిని ఉదయం నుండి ఎన్నిసార్లు వేడుకున్నానో నాకే తెలియదు.

అన్యమనస్కంగానే లేచా... ''వస్తారా!'' అంటూ ఇంటివైపు అడుగులేసా.

''ఏరా...? ఈరోజు మరీ ముందు వెళుతున్నావు?'' అప్పుడు సమయం ఎనిమిది.

మామూలుగా వాడి షాపు కట్టేసాకే ఇద్దరం కదిలేవాళ్ళం. వాడి ఇల్లు దాటాకే మా ఇల్లువచ్చేది... అనుకోకుండా ఆ వీధి చివరి టీ బండివైపు చూసా... అప్పుడప్పుడు సూర్యం షాపు దగ్గరికి ఈ టీ బండి నుండి టీ తెప్పించుకునే వాళ్ళం.

''ఏం...? సార్! ఒక్కరే వెళుతున్నారేంటి'' అడిగాడు ఆ టీ బండివాడు.

''ఆఁ... ఏంలేదు కొద్దిగా పని వుంది...''

''టీ కావాలా సార్...''

''వద్దులే...'' అంటూ ముందుకు కదిలాను.

వాణ్ణి చూస్తుంటే ఒక్కోసారి ఆశ్చర్యం వేస్తుంది నాకు... దాదాపు 15 ఏళ్ళ నుండి అక్కడే చూస్తున్నా...

## జీవితం

శబ్దం శబ్దమే కాని
అది కేవలం శబ్దంకూడా కాదు
కాస్త ఉప్పు
కాస్త చక్కెర
దానికొసలనిండా కన్నీటి రుచి
అదొక ఉత్తేజం!
అర్థం అర్థమే కాని
అది నిరర్థకం కూడా
నిఘంటువులన్నీ విఫలమౌతాయి
అనుభవమే దాని సారాంశం
ఇక లయ అంటారా!
జీవితాన్ని బ్యాలెన్స్ చెయ్యడమే లయ
కుంటి నడకలో కూడా లయ వుంటుంది
ఎంత అందమైందీ జీవితం!

డా॥ ఎన్.గోపి

## కవి తపస్సు

ఆలోచనలతో రమింపబడిన మేధస్సు
సమాజ అకృత్యాలకు ద్రవింపబడిన మనస్సు
చైతన్య కలంతో
సౌశీల్య కాగితంపై సాగిపోతే
పదాలలో ఉషస్సు
వాక్యాలలో తేజస్సు
పరిమళాలై జగాన విస్తరిస్తాయి
మనస్సులను కదిలించే
వీచికలవుతాయి
ప్రభాత కిరణ
రేఖలై ఉదయిస్తాయి
మనస్సులను కదిలించే
భావాల వీచికలౌతాయి
సుప్తభావాల కౌగిలిలో
ప్రేరణా మంత్రాలవుతాయి
చిగురించిన మేను ద్రుమనులలో
చేతనా వసంతాలౌతాయి
నిరాశల నింగిని కప్పుకుని
అలసత్వ సమాధిలో
అలమటించు దీనజన
ఆర్తనాదాలలో
ఆరిపోని జాగృత
దివ్వెలవుతాయి
తపస్సుకు వరంగా
ఉదయించిన కవితలు
కవి యశస్సుల
హారాలై నిలిచిపోతాయి

**సిరిసిల్లా గఫూర్ శిక్షక్**

వాడి పేరు రఘు. ఆ బండివద్ద వాడికి పదేళ్ళు ఉన్నప్పుడు పనికి కుదిరాడు వాడు. అప్పుడు వాణ్ణి చూస్తే బడికెళ్ళే వయసులో దారుణంగా పనిలోకి పంపించారే... అప్పట్లో వాడి తల్లిదండ్రులమీద పీకలదాకా కోపం వచ్చేది. ఏమి సహాయం చేయలేని అశక్తత నాది. అదే దారిలో వెళ్ళే నేను రోజు పలకరించేవాణ్ణి... ఆనాడు వాడు బడిమానేసి పనిలోకి వెళితే బాధపడిన నేను. ఈరోజు వాడు ఆ బండికి ఓనరయ్యాడు. రోజు వాడి సంపాదన 300 పైనే. కృష్ణప్రసాద్‌ను చదివించి తప్పు పనిచేశానా అనిపిస్తుంది ఒక్కోసారి.

ఆలోచనలతో ఇంటిలోకి అడుగుపెట్టిన నాకు పెద్దబ్బాయి ముఖం చూసి ఆగిపోయా...

"ఏరా...! ఏమైంది వెళ్ళినపని...?"

"అంతా మీ చేతులలోనే ఉంది..."

"ఏంటీ! కాస్త అర్థమయ్యేటట్లు చెప్పు" అడిగా వాణ్ణి.

"ఆ జాబ్ రావాలంటే సెక్యూరిటీ డిపాజిట్‌గా 25 వేలు కట్టాలట. ఇస్తారా మీరు..." వ్యంగ్యంగా అడిగాడు వాడు.

ఒక్కసారి నా గుండె ఝల్లుమంది... సమాధానం కూడా వాడికి తెలుసు. కాబోలు... "ఎలాగు ఆ జాబ్ నాకు రాదు. వేరొకరికి ఇచ్చుకోండి అని కంపెనీ వారికి చెప్పేసి వచ్చా" అన్నాడు వాడు.

"కృష్ణ...! ఏంటీ ఆ మాటలు. మన పరిస్థితి తెలిసే అలా అంటున్నావా...? ఎక్కడి నుండి తేగలడు మీ నాన్న...? అక్కయ్య పెళ్ళికి చేసిన అప్పులే ఇంకా అలాగే ఉన్నాయి. నీకు ఆ పాతికవేలు ఎక్కడినుండి తెచ్చేది" నా భార్య మధ్యలోనే అందుకుంది.

ఏమనుకున్నాడో వాడు ముఖం గంటుపెట్టుకొని విసురుగా పక్కరూములోకి వెళ్ళాడు.

"ముందు మీరు కాళ్ళు కడుక్కోండి. భోజనం చేశాక ఆ విషయం ఆలోచించండి" అంటూ లుంగీ అందించింది.

"కృష్ణను కూడా పిలువ్. కలిసే భోజనం చేస్తాం అన్నా..." ప్యాంటు నుండి లుంగీలోనికి మారుతూ.

"మీరు బాగా... భోజనం చేయండి... నే తరువాత తింటాన్లే" కోపంగా అన్నాడు కృష్ణ.

తిరిగి రెట్టించలేదు. నేను... వాడి సంగతి తెలుసు కనుక...

"సర్లే మన ముగ్గురికి వడ్డించు. ఉష రామ్మా...! శాంత పిలుపుతో ముగ్గురం భోజనాలు పూర్తి చేశాం. చిన్నవాడు రాత్రి పదిగంటలకు వచ్చేది. వాడితోపాటు

పెద్దాడు తింటాడ్లే అని సరిపెట్టుకున్నాడు.

❖ ❖ ❖

మరునాడు పక్కింటివాళ్ళ పేపరు చదువుతూ వరండాలో కూచున్న నాకు చిన్నబ్బాయి వెంకట చైతన్య వచ్చి ''నాన్నా'' అన్నాడు.

''ఏంటీ...?'' అన్నా పేపర్లోంచి తలతిప్పకుండానే.

మళ్ళీ పిలిచాడు వాడు... ''ఏంటీ...?'' తల పేపర్లోంచి తీసి అడిగా.

''మరేం లేదు నాన్న. నా దగ్గర మూడువేలు ఉన్నాయి. వేరొకరిదగ్గర పనిచేసే బదులు నేనే మెకానిక్ షాప్ పెట్టుకుంటా... మీరు సరేనంటే'' నాన్చుతూ అడిగాడు వాడు.

''డబ్బేమైనా కావాలా...?'' డబ్బు సహాయం నా దగ్గర నుండి రాదు. ఆ విషయం వాడికి తెలుసు. అయినా ఓ తండ్రిగా అడిగా వాడిని.

''డబ్బు ఇబ్బంది లేదు నాన్నా ఈ మూడువేలు టూల్స్‌కి సరిపోతుంది. సంగారెడ్డి ఎక్స్ రోడ్‌లో షెడ్ కూడా మాట్లాడా... రేపటి నుండి అందులో స్టార్ట్ చేయాలనే....'' అనుమతిగా అడిగాడు.

''సరే నీ ఇష్టం ప్రారంభించు'' అభయమిచ్చా వాడికి. సంతోషంగా వెళ్ళిపోయాడు వాడు.

ఒకరోజు సాయంత్రం ఇంటికి వచ్చిన నాకు అందరి సమక్షంలోనే వెంకట్ రెండువేలు నా చేతిలో పెట్టాడు. షెడ్ పెట్టి అప్పటికే నలభై రోజులయ్యింది. నా భార్య, కూతురి ముఖాలు డబ్బును చూడగానే విప్పారాయి. చిన్నబ్బాయిని చూడండి స్వంత షెడ్‌పెట్టి దాదాపు నెలరోజుల్లోనే రెండు వేలు చేతిలో పెట్టాడు. సంతోషంగా అంది శాంత.

ఈ మాటలు విన్న కృష్ణప్రసాద్ మెల్లగా బయటికి వెళ్ళిపోయాడు. తాను పెద్ద చదువులు చదివినా తండ్రికి చేదోడుగా లేకుండాపోయానే అన్న బాధావీచిక వాడి కళ్ళలో కనబడింది నాకు.

మొదటిసారి నా భార్యపై కోపం వచ్చింది నాకు. ''ఏ సమయంలో ఎలా మాట్లాడాలో నేర్చుకో శాంతా...'' మందలించా తనని.

పెదబాబు ముఖం చూసి వాణ్ణి సరియైన మార్గంలో పంపించానా... అనిపించింది. ప్రభుత్వం అందరికి చదువు అంటుంది. మరి చదువుకున్న నా కొడుక్కి ఏమిచ్చింది. జాబ్‌లను కొనే స్థోమతలేదు... నాకు లేని చదువు నా కొడుక్కి అందించాలన్న నా ఆశయం పూర్తిగా నెరవేరిందా...?

## ప్రేమ దీపం

ప్రేమ
దీపం లాంటిది
అందులో తైలం నువ్వు
వత్తి నేను
ప్రకృతో, మనిషో
బతుకు మర్మమెరిగి
ఆ దీపాన్ని వెలిగించాలి
బతుకుల్ని వెలిగించడానికి
జగతిని వెలిగించడానికి
ప్రేమజ్యోతి
బహుశా ఆరిపోదు
మనుషులున్నంతకాలం
మమతలున్నంత కాలం

సబ్బని లక్ష్మీనారాయణ

టీ బండి రఘును చూసినప్పుడల్లా నా కొడుకును చదివిస్తున్నా... వాడి భవిష్యత్‌లో మంచి వృద్ధిలోనికి వస్తాడు అనుకునేవాణ్ణి. 'స్వయంఉపాధి' కొరకు బ్యాంకుల చుట్టూ తిరిగినా 'ఖానీ' రాలలేదు వాడికి. నాకు లేని చదువు వాడికి అబ్బినందుకు సంతోషించాలా? లేక చదివిన చదువుకు సార్ధకత కాలేని చదువుందని సంబర పడాలో చేతిలో డబ్బును చూసుకుంటూ కూర్చున్న నాకు...మిగతా ముగ్గురు నా దగ్గరి నుండి వెళ్ళగానే పెద్ద బ్బాయి నా దగ్గరికి వచ్చి కేవలం ఒకే ప్రశ్న వేసాడు...

''నన్నెందుకు చదివించావు నాన్న...?''

ఏమని సమాధానం చెప్పను వాడికి... ఉపాధి అందించని పెద్దబ్బాయి చదువు గొప్పదా...? లేక ఉపాధి చూపిన చిన్నవాడి పనితనం గొప్పదా...? సమాధానం లేని ప్రశ్నలే అవి.

తెల్లవారి ఉదయం టీ బండి ముందు నుంచి వెళుతూ... ''రఘు చిన్నప్పుడు మీ నాన్న మంచి పని చేశాడు'' అన్నాను వాడితో అర్ధం కాలేదు వాడికి. అర్ధం అయిన నాకు అన్ని తెలిసినా కృష్ణప్రసాద్‌తో 'తప్పు' టడుగులు వేయించానా... మీరే చెప్పండి. ■